ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

రంగారెడ్డి

5

జిల్లా వార్తలు

బుధవారం 10 జూలై 2024



11 గ్రాముల ఎండీఎంఏ డ్రగ్ స్వాధీనం



పట్టుకున్న డ్రగ్

శంషాబాద్, జూలై 9: శంషాబాద్‌లోని ఓ హోటల్ సమీపంలో ఆర్జీఐఏ పోలీసులు మంగళవారం రాత్రి డ్రగ్స్ పట్టుకున్నారు. ఓ హోటల్ సమీపంలో డ్రగ్స్ వ్యవహారం నడుస్తోందని పోలీసులకు సమాచారమందింది. దీంతో పోలీసులు వెంటనే ఆ ప్రాంతానికి వెళ్లి తనిఖీలు చేయగా ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించాడు. అతడిని సోదా చేయగా 11గ్రాముల(ఎండీఎంఏ) డ్రగ్ లభ్యమైంది. పోలీసులు అతడిని విచారిస్తున్నారు. ఈ డ్రగ్ ఎక్కడి నుంచి తెచ్చారు? ఎవరెవరు సరఫరా చేస్తున్నారు? అనే కోణాల్లో దర్యాప్తు చేపట్టారు.

డెంగీ పంజా!

ప్రబలుతున్న విష జ్వరాలు

- ఆస్పత్రుల్లో పెరుగుతున్న రోగుల సంఖ్య
- జీహెచ్ఎంసీ, మున్సిపాలిటీల పరిధుల్లోనే అధికం
- దవాఖానాలకు క్యూ కడుతున్న బాధితులు
- డెంగీతో 11ఏళ్ల బాలుడి మృతి
- వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలంటున్న వైద్యులు



మృతిచెందిన మణీశ్వర్(ఫైల్)

డెంగీతో బాలుడి మృతి

చేవెళ్ల మండలం చెన్‌వెల్లిలో ఇద్దరు అన్నదమ్ములకు నాలుగు రోజుల క్రితం తీవ్ర జ్వరం సోకింది. వారిని చేవెళ్లలోని పట్నం మహేందర్‌రెడ్డి జనరల్ ఆసుపత్రిలో చేర్పించారు. వారికి డెంగీ జ్వరంగా వైద్యులు గుర్తించారు. మణీశ్వర్(11) అనే బాలుడు చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. అతడి తమ్ముడు వర్షిత్ డెంగీ నుంచి కోలుకున్నాడు. మణీశ్వర్‌కు ఇంజక్షన్ డోసు ఎక్కువగా ఇవ్వడం వల్లే చనిపోయాడని తల్లిండ్రులు ఆరోపించారు. వైద్యుల నిర్లక్ష్యంతో తమ కొడుకు మృతిచెందినట్లు తల్లిండ్రులు కుర్వ శ్రీనివాస్, సంతోష ఆరోపించారు. గ్రామస్తులతో కలిసి ఆస్పత్రి వద్ద ఆందోళన చేశారు. ఉద్రిక్తత చోటుచేసుకోవడంతో పోలీసులు వచ్చి సర్దిచెప్పినా వినిపించుకోలేదు. దీంతో బాధితులకు రూ.5లక్షలు ఇచ్చేందుకు ఆస్పత్రి యాజమాన్యం ఒప్పుకున్నట్టు సమాచారం.

జిల్లాపై డెంగీ పంజా విసురుతోంది. తాజాగా చేవెళ్ల మండలం చెన్‌వెల్లికి చెందిన 11 ఏళ్ల బాలుడు చికిత్స పొందుతూ మృత్యువాత పడ్డాడు. జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు మొత్తం 55 డెంగీ కేసులు నమోదవగా ఒకరు మృతిచెందారు. దోమల వ్యాప్తి పెరిగి జనం విషజ్వరాలు, డెంగీ బారిన పడుతోన్నారు. వైద్యారోగ్యశాఖ అధికారుల లెక్కప్రకారం జిల్లాలో ఇప్పటి వరకు 55 డెంగీ కేసుల రికార్డయ్యాయి. వీటికి అదనంగా ప్రైవేట్ ఆస్పత్రుల్లో డెంగీతో చికిత్స పొందుతున్న వారి సంఖ్య 55 వరకు ఉంటుందని అంచనా. గ్రామీణ ప్రాంతాల కంటే గ్రేటర్, నగరం చుట్టుపక్కలున్న మున్సిపాలిటీల్లో డెంగీ కేసులు ఎక్కువగా నమోదవుతున్నాయి. వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్య శాఖ అధికారులు సూచిస్తున్నారు.



ఇళ్ల మధ్య నిలిచిన మురుగు నీరు

(ఆంధ్రజ్యోతి-రంగారెడ్డి అర్బన్, జూలై 9): జిల్లాలో డెంగీ విజృంభిస్తోంది. ఒక్కసారిగా కేసులు పెరుగుతున్నాయి. పట్టణ ప్రాంతాల్లోనే డెంగీ కేసులు నమోదు ఎక్కువగా ఉంది. జనవరి నుంచి ఇప్పటి వరకు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లెక్కల ప్రకారం మొత్తం 55 డెంగీ కేసులు నమోదవడం చూస్తే భయాందోళనకు గురిచేస్తోంది. ప్రధానంగా జీహెచ్ఎంసీ ప్రాంతాల్లో ఈ పరిస్థితి ప్రమాదకరంగా మారింది. నమోదైన డెంగీ కేసుల్లో జీహెచ్ఎంసీ పరిధిలో 39, మున్సిపాలిటీల్లో 11, గ్రామీణ ప్రాంతాల్లో 4 ఉన్నాయి. కాగా లెక్కలోకి రాని డెంగీ కేసులు ఎక్కువగానే ఉన్నట్టు పరిస్థితిని బట్టి తెలుస్తోంది. విష జ్వరాలతో జనం విలవిల్లాడుతున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన వైద్యమందక రోగులు ప్రైవేట్ దవాఖానాలకు పరుగులు తీస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో అవుట్/ఇన్ పేషెంట్ల సంఖ్య పెరుగుతోంది. దోమల వ్యాప్తితో రోగాలు పెరుగుతున్నాయని, దోమ కాటుకు గురికాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని డాక్టర్లు సూచిస్తున్నారు.

డెంగీ కేసుల వివరాలు	
గ్రామీణ ప్రాంతాల్లో	04
మునిసిపాలిటీల్లో	11
జీహెచ్ఎంసీ పరిధిలో	39
మృతులు	01
మొత్తం	55

నివారణ ఇలా..

దోమలు వృద్ధి చెందకుండా పరిసరాల పరిశుభ్రంగా ఉంచుకోవాలి. నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. నీటిపై దోమల మందు చల్లించడం, ఫాగింగ్ చేయించాలి. నీటి కంటైనర్లకు, ఆహారపదార్థాలకు ఎల్లప్పుడూ మూతలు పెట్టాలి. దోమ తెరలు వాడటం ఉపయోగకరంగా ఉంటుంది. పూర్తిగా కప్పి ఉంచే బట్టలు ధరించటం, ఓడోమాస్ వంటి క్రీములు పూసుకోవడం చేయాలి.

విజృంభిస్తున్న జ్వరాలు

డెంగీ, జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇంట్లో ఒక్కరికి వస్తే మరొకరికి సోకుతున్నాయి. జ్వరం, దగ్గు, జలుబు సమస్యలు జనాన్ని పీడిస్తున్నాయి. వృద్ధులు జ్వరాల నుంచి బయటపడటం లేదు. దోమ కాటువల్లే రోగాలు, సీజనల్ వ్యాధులు వస్తున్నాయని డాక్టర్లు చెబుతున్నారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వ ఉంటే డెంగీ దోమలు వృద్ధి చెందుతాయని, అపరిశుభ్ర వాతవరణంతోనే రోగాలు వస్తున్నాయని అంటున్నారు. ఇదిలా ఉంటే జిల్లాలో జనవరి నుంచి ఇప్పటి వరకు 8,067 విష జ్వరాల కేసులు నమోదయ్యాయి.

లోపిస్తున్న పారిశుధ్యం

కురుస్తున్న వర్షాలకు దోమలు వృద్ధి చెందుతున్నాయి. పట్టణాల్లో మురుగు కాల్వలను శుభ్రం చేయక దోమలు పెరుగుతున్నాయి. గ్రామాల్లోనూ మురుగు కాల్వల్లో పూడిక పేరుకొని మురుగు నీరు ఎక్కడికక్కడే నిలుస్తోంది. నిల్వ నీటిలో దోమలు వృద్ధి చెందుతున్నాయి. ప్రతీ శుక్రవారం డ్రై డే నిర్వహించి నీటి గుంతలతో పాటు మురుగు కాల్వలు, పగిలిన కుండలు, తొట్లు, డ్రమ్ముల్లో నీటిని తొలగించాల్సి ఉన్నా ఇది పక్కాగా అమలు కావడం లేదు. నిల్వ నీటి కారణంగానే దోమలు పెరుగుతున్నాయి. అధికారులు పరిసరాల పరిశుభ్రత, సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి చేతులు దులుపుకుంటున్నారు తప్పితే విష జ్వరాలు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి.

గత నాలుగేళ్లలో వ్యాధుల బారిన పడ్డవారి లెక్కలివీ...				
సంవత్సరం	డయేరియా	జ్వరం	శ్వాసకోస	స్వైన్ ఫ్లూ
2021	803	4573	1,003	108
2022	05	15,345	09	04
2023	1,264	17,552	826	79
2024	586	8,067	131	02

2024 జనవరి నుంచి జూలై వరకు నమోదైన వ్యాధుల వివరాలు								
వ్యాధులు	జనవరి	ఫిబ్రవరి	మార్చి	ఏప్రిల్	మే	జూన్	జూలై	మొత్తం
డయేరియా	91	86	68	83	116	116	26	586
జ్వరాలు	1,462	1,351	1,405	1,270	1,159	1,132	288	8,067
తీవ్ర శ్వాసకోస	74	28	08	06	08	04	3	131
స్వైన్ ఫ్లూ	0	0	0	0	01	0	01	02

ఫాగింగ్ కరువు

డెంగీ వచ్చేందుకు కారకాలైన దోమల నివారణకు మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీలు ఫాగింగ్ చేయడం లేదు. చాలా పంచాయతీల్లో ఫాగింగ్ యంత్రాలే లేవు. ఉన్న కొన్ని చోట్ల పనిచేయడం లేదు. ఒక్కసారి ఫాగింగ్ చేయాలంటే కనీసం రూ.25వేలు ఖర్చు అవుతుండటంతో నిధుల కొరత కారణంగా ఫాగింగ్ చేయడంలేదని తెలుస్తోంది.

డెంగీ నమోదైతే

డెంగీ కేసులు నమోదైతే ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక నివారణ చర్యలు చేపడుతారు. డెంగీ బాధిత వ్యక్తి ఇంటి పరిసరాల్లోని 50 మీటర్ల వరకు పైరెథ్రమ్ అనే మందును పిచికారీ చేయిస్తారు. 19 లీటర్ల కిరోసిన్‌కు లీటరు పైరెథ్రమ్ అనే ద్రావణాన్ని కలిపి పిచికారీ చేస్తారు. ఇలా చేయడం ద్వారా దోమలు చనిపోతాయి. వాటితో పాటు దోమల గుడ్లు కూడా నశిస్తాయి.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

డెంగీ రాకుండా ప్రజలు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వారంలో ఒక రోజును డ్రై డేగా పాటించి నీటి ట్యాంకులను శుభ్రం చేసుకోవాలి. పాత టైర్లు, నీటి ట్యాంకులు, పూల తొట్లలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి. దోమతెరలు, దోమల నివారణకు విక్రయించే వివిధ కంపెనీల లిక్విడ్లు, మస్కిటో కాయిల్స్‌ను వినియోగించాలి. వాననీటి గుంతల్లో ఆయిల్ బాల్స్‌ను వేయాలి. మురుగు నీరు నిల్వ ఉండకుండా, పారిశుధ్యం లోపించకుండా చూసుకోవాలి. మరుగుదొడ్ల ఎయిర్ పైపులకు జాలి, లేదా పలుచని వస్త్రం కట్టాలి.

'ప్రైవేట్'లో దోపిడీ

కొందరు జ్వర బాధితులు ప్రభుత్వ ఆస్పత్రులకు వెళ్లకుండా ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకుంటున్నారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో డెంగీ చికిత్సకు ఒక్కో రోగి నుంచి చికిత్స పేరుతో రూ.40వేలు మొదలుకొని లక్షల్లో దోపిడీ చేస్తున్నారు. ప్లేట్‌లెట్లు తగ్గాయని, వాటిని ఎక్కించాలని రోగుల జేబును గుల్ల చేస్తున్నారు. సాధారణ జ్వరంతో వెళ్లినా ఐసీయూలో ఉంచి చికిత్స చేసి వేలల్లో బిల్లులు వసూలు చేస్తున్నారు.

డెంగీ లక్షణాలు

ఎడిస్ ఈజిప్ట్ దోమ కుట్టడం వల్ల డెంగీ ప్రబలుతుంది. ఈ దోమలు పగటి పూటే కుడతాయి. ఈ దోమలు ఎక్కువగా మంచినీటిలో వృద్ధి చెందుతుంటాయి. ఈ దోమకాటుతో వ్యాధి సోకితే కళ్లలో నొప్పి, శరీరంపై దద్దుర్లు రావడం, వాంతులు, విరేచనాలు, చిగుళ్లు, ముక్కు నుంచి రక్తస్రావం అవుతుంటుంది. తెల్ల రక్తకణాల సంఖ్య బాగా తగ్గుతుంది. తీవ్ర జ్వరం వస్తుంది. అకస్మాత్తుగా ఎముకలు, కండరాలు, కీళ్ల నొప్పులు వస్తాయి. జ్వరం తగ్గినట్లే అనిపించి వారం, పది రోజుల్లో మళ్లీ వస్తుంటుంది. తెల్ల రక్తకణాల సంఖ్య 30వేల దిగువకు పడిపోతే ప్రాణానికే ముప్పు. డెంగీ లక్షణాలు కన్పించిన వెంటనే చికిత్స తీసుకోవాలి. సాధారణంగా ఎడిస్ ఈజిప్ట్ దోమ కుట్టిన తర్వాత ఐదు నుంచి ఏడు రోజుల్లో డెంగీ లక్షణాలు కనపడతాయి. డెంగీ సాధారణ జ్వరంలా రావచ్చు. తీవ్ర రక్తస్రావం అయి ప్రాణాంతకం కావచ్చు. మెదడు వంటి ఇతర అవయవాలపై ప్రభావం చూపి మరణానికి కూడా దారితీసే ప్రమాదం ఉంది. జ్వరం బాగా వచ్చిన వారు వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలి. రెండు రోజుల కన్నా ఎక్కువ సమయం జ్వరం ఉంటే వెంటనే టెస్ట్‌లు చేయించుకోవాలి. డెంగీ పాజిటివ్ వస్తే రోగిని వైద్యులు ఆస్పత్రిలో చేర్చుకుని చికిత్స చేస్తారు. చికిత్స సమయంలో రోగులు జాగ్రత్తలన్నీ పాటిస్తూ మందులు సమయానికి తీసుకోవాలి.

నియమాలు పాటించాల్సిందే ...

పరీక్షల్లో డెంగీ ఉందని తేలితే నిర్లక్ష్యం చేయొద్దు. వెంటనే చికిత్స తీసుకోవాలి. రోగి శరీరాన్ని చల్లని గుడ్డతో తుడుస్తుండాలి. రోగిని చల్లని ప్రదేశంలో పడుకోబెట్టాలి. డెంగీ వస్తే ప్లేట్లెట్ల సంఖ్య బాగా తగ్గిపోతుంది. వైద్యులు ప్లేట్లెట్లను పెంచేందుకు మందులు ఇస్తారు. వాటితోపాటు బొప్పాయి ఆకుల రసాన్ని స్వల్ప మోతాదులో తాగుతుండాలి. ఇలా చేస్తే ప్లేట్లెట్ల సంఖ్యను పెంచుకోవచ్చు. డెంగీ వచ్చిన వారు రోగ నిరోధక శక్తిని పెంచే పండ్లు, ఇతర ఆహారాన్ని ఎక్కువగా తీసుకుంటే త్వరగా నయం అవుతుంది. పండ్ల రసాలు, కొబ్బరి నీళ్లు, ద్రాక్ష, కివీ, దానిమ్మ, నారింజ పండ్లను తీసుకుంటే డెంగీ నుంచి త్వరగా కోలుకోవచ్చు. రెండు, మూడు రకాల కూరగాయలను గ్రైండ్ చేసి వాటి రసం తీసుకుంటే శరీరానికి సహజ పోషకాలు లభిస్తాయి. డీహైడ్రేషన్ రాకుండా కొబ్బరి నీరు తాగాలి. డెంగీ నుంచి కోలుకునేందుకు హెర్బల్ టీ ఎంతో ఉపకరిస్తుంది. వేప ఆకులు డెంగీ వైరస్ వ్యాప్తిని అరికడతాయి. రోగికి వేప ఆకులతో స్నానం చేయడం మంచిది. నూనె పదార్థాలు, వేపుళ్లు, కేఫిన్, కార్బొనేటెడ్ పానీయాలు, కారం వస్తువులు తీసుకోవద్దు. కొవ్వు పదార్థాలుండే ఆహారాన్ని డెంగీ తగ్గేంత వరకు తినకపోవడం మంచిది.

రోగాలు రాకుండా ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలి



వర్షాలు కురుస్తున్నందున వ్యాధులు ప్రబలే అవకాశాలున్నాయి. రోగాల బారిన పడకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. ఇళ్ల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. దోమలు వృద్ధి చెందకుండా ఉండాలంటే పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి. ముందస్తు జాగ్రత్తలతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యం. జ్వర లక్షణాలు కనిపించిన వెంటనే ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స పొందాలి. పరిశుభ్రమైన వేడి ఆహారాన్నే భుజించాలి.

\- వెంకటేశ్వరరావు, డీఎంహెచ్‌వో

జీవకోటికి మొక్కలే ప్రాణాధారం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ప్రతినిధులు

ఇబ్రహీంపట్నం, జూలై 9: స్కూల్ ఎర్త్ క్లబ్-యంగ్ ఎర్త్ లీడర్ ప్రోగ్రామ్‌లో భాగంగా కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవెల్యూషన్ ఆధ్వర్యంలో దండుమైలారం ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం ఔషధ మొక్కలు నాటారు. ప్రోగ్రాం అధికారి విశ్వేశ్వర్‌రావు ఔషధ మొక్కలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. జీవ కోటికి మొక్కలు ప్రాణాధారమని పర్యావరణ పరిరక్షణకు ప్రతీ ఒక్కరు ముందుకు రావాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో చెట్లను నరకొద్దని, అడవులను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు గోవర్ధన్, సీజీఆర్ ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ నగేష్, షర్వాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ముంబయిలో భారీ వర్షాలు ..
విమాన సర్వీసుల మళ్లింపు

- శంషాబాద్ ఎయిర్‌పోర్టులో ల్యాండింగ్



శంషాబాద్ రూరల్, జూలై 9: రెండు రోజులుగా మహారాష్ట్రలోని ముంబయిలో కురుస్తున్న భారీవర్షాల కారణంగా జాతీయ, అంతర్జాతీయ విమాన సర్వీసులను శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు మళ్లించారు. ఎయిర్‌పోర్టు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమ, మంగళవారాలు కురిసిన భారీ వర్షాలతో అక్కడ ఫ్లైట్‌లు దిగే వాతావరణం లేక శంషాబాద్‌కు మళ్లించారు. దోహ నుంచి వచ్చే విస్తార యూకే 286 విమానం, యూకే నుంచి 6006 విమానం, గోవా నుంచి ఇండిగో 6ఈ 5019 విమానం, నాగ్‌పూర్ నుంచి 6ఈ 2058 ఇండిగో విమానం, 6ఈ 1912, దోహ నుంచి వచ్చిన ఆకాశ క్యూపీ071 విమానం, జైపూర్ నుంచి వచ్చిన ఎయిర్‌ఏషియా ఇండియా విమానం, కొలంబో నుంచి వచ్చిన శ్రీలంక ఎయిర్ యూఎల్ 141విమానం, దోహ-ఖతర్ ఎయిర్ వేస్ క్యూఆర్ 556 విమానం, డీఎక్స్‌బీ నుంచి ఎమిరేట్స్ ఈకే 500 విమానాలు ముంబయి ఎయిర్‌పోర్టులో ల్యాండ్ కావాల్సి ఉంది. అక్కడ అతిభారీ వర్షాలతో వాతావరణం అనుకూలించక, రన్‌వేపై వర్షపు నీరు నిలవడంతో విమానాలను శంషాబాద్ విమానాశ్రయానికి మళ్లించారు. దీంతో గమ్యస్థానాలకు చేరుకోలేక ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. శంషాబాద్ నుంచి ముంబయికి వెళ్లాల్సిన విమానాలూ రద్దయ్యాయి. ప్రయాణికుల టికెట్ డబ్బులు వాపస్ చేస్తామని ఎయిర్‌లైన్స్ సంస్థలు ప్రకటించాయి. మరో రెండు రోజులు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది. ప్రయాణికులకు ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నామని ఎయిర్‌పోర్టు అధికారులు పేర్కొన్నారు. కొందరికి ఇప్పకే నోవాటెల్ హోటల్‌లో బస ఏర్పాట్లు చేశామన్నారు. ఆన్‌లైన్‌లో టికెట్ తీసుకున్న వారికి ఆన్‌లైన్‌లోనే డబ్బులు వాపస్ చేస్తామని ఎయిర్‌లైన్స్ సంస్థలు ఈ సందర్భంగా తెలిపాయి.

పంచాయతీలకు కార్యాలయాల్లేవ్!

- చాలా గ్రామాల్లో శిథిలావస్థకు పాత భవనాలు
- కొన్ని చోట్ల నేటికీ లేని పంచాయతీ ఆఫీసులు
- అంగన్‌వాడీలు, కమ్యూనిటీ హాళ్లు, పాఠశాలల్లో నిర్వహణ
- పునాదులకే పరిమితమైన నూతన భవనాల నిర్మాణం



వినాయక మండపంలో కొనసాగుతున్న పాత ఆగిర్యాల పంచాయతీ కార్యాలయం

కొందుర్గు, జూలై, 9 : గ్రామ పాలనకు ముఖ్యమైన పంచాయతీ కార్యాలయాలు శిథిలావస్థకు చేరుకోవడం, మరికొన్నింటికి సొంత భవనాలు లేక, మంజూరైన వాటికి భవనాల నిర్మాణాల పూర్తికాక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. చాలాచోట్ల పంచాయతీ కార్యాలయాలు కమ్యూనిటీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, పాఠశాల గదుల్లో కొనసాగుతున్నాయి. గ్రామస్తులకు, సిబ్బంది ఇబ్బందులు తప్పడం లేదు. కొందుర్గు మండలంలో 22 గ్రామ పంచాయతీలున్నాయి. విశ్వనాథ్‌పూర్ పంచాయతీ భవనం శిథిలావస్థకు చేరడంతో ఐదేళ్ల పాటు అద్దె భవనంలో కొనసాగించారు. ఒక్క గదిలో సమావేశాల నిర్వహణకు ఇక్కట్లు పడ్డారు. 2023 జూలై 7 నూతన భవనానికి ఉపాధి హామీ నిధులు 20లక్షలు మంజూరయ్యాయి. పంచాయతీ కార్యాలయాన్ని కడుతున్నారని సంతోషించిన గ్రామస్తుల ఆశలు అడియాశలయ్యాయి. పునాదుల వద్దే భవన నిర్మాణానికి నిలిచింది. ప్రస్తుతం మహిళా సంఘం భవనంలో పంచాయతీని నిర్వహిస్తున్నారు. అలాగే లక్ష్మీదేవిపల్లి పంచాయతీ నిర్మాణం కూడా పునాదులకే పరిమితమైంది. అంగన్‌వాడీ భవనంలో కొనసాగిస్తున్నారు. చెర్కుపల్లిలో పంచాయతీకి కూడా నూతన భవనం మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. అంగన్‌వాడీ సెంటర్లో ఆఫీసును కొనసాగిస్తున్నారు. అయోధ్యపూర్ తండాకు పంచాయతీ భవనం మంజూరైనా పనులు ప్రారంభం కాలేదు. ఇక్కడి కమ్యూనిటీ హాల్‌లో పంచాయతీని కొనసాగిస్తున్నారు. పులుసుమామిడి, పాత ఆగిర్యాలకు పంచాయతీలకు భవనాలు మంజూరు కాలేదు. పాత ఆగిర్యాలలో వినాయక మండపంలో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు.

శిథిలావస్థకు పాత పంచాయతీ భవనాలు



పాఠశాల భవనంలో కొనసాగుతున్న పులుసుమామిడి పంచాయతీ కార్యాలయం

శ్రీరంగాపూర్‌లో పంచాయతీ భవనాన్ని 1977లో కట్టారు. ఆ భవనం శిథిలావస్థకు చేరింది. వానకాలం ఉరుస్తోంది. దీంతో పక్కనే ఉన్న మహిళా సంఘం భవనంలో పంచాయతీ కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. టేకులపల్లి పంచాయతీ భవనాన్ని 1992లో నిర్మించినా అదీ శిథిలావస్థకు చేరింది. రేగడి చిల్కమర్రిలోని పంచాయతీ భవనం కూడా పాతదైంది. చిన్న ఎల్కిచర్లలో భవనం శిథిలావస్థకు చేరింది. మండలంలోని 22 పంచాయతీల్లో 6 పంచాయతీలకు భవనాలే లేవు. ప్రతీ ఎన్నికల్లో కొత్త కార్యాలయాలు కట్టిస్తామని చెబుతున్నా గెలిచిన తరువాత పట్టించుకోవడం లేదని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రామ పాలనకు గుండె వంటి పంచాయతీ కార్యాలయాలను నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.

కొత్త భవనాన్ని మంజూరు చేయాలి



గ్రామ పంచాయతీ భవనం లేక పాఠశాలలోని ఓ గదిలో కార్యాలయాన్ని కొనసాగిస్తున్నారు. దీంతో మాకు ఇబ్బందులు కలుగుతున్నాయి. పాఠశాల వేళల్లో సమావేశాలు నిర్వహిస్తే విద్యార్థులకూ ఇబ్బందులే. కాబట్టి కొత్తగా పంచాయతీ భవనం కట్టించాలని ఉన్నతాధికారులకు చెప్పాం.

\- జహంగీర్, పులుసుమామిడి

ప్రతిపాదనలు పంపాం



మండలంలో శిథిలావస్థకు చేరిన పంచాయతీల గురించి, ఇప్పటికీ భవనాలు లేని పంచాయతీలకు నూతన భవనాల మంజూరు కోసం ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపాం. లక్ష్మీదేవునిపల్లి, విశ్వనాథ్‌పూర్ గ్రామాల్లోని చేపట్టిన భవన నిర్మాణాలను త్వరలోనే పూర్తి చేయిస్తాం.

\- లాలయ్య, ఎంపీవో, కొందుర్గు

నూతన ఆవిష్కరణలకు జిల్లా వేదిక కావాలి

- కలెక్టర్ శశాంక

రంగారెడ్డి అర్బన్, జూలై 9: నూతన ఆవిష్కరణలకు రంగారెడ్డి జిల్లా వేదిక కావాలని కలెక్టర్ శశాంక అన్నారు. మంగళవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో ఇంటింటా ఇన్నోవేటర్ కార్యక్రమంపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రదర్శించే నూతన ఆవిష్కరణల కోసం ప్రతి ఒక్కరూ ఇంటింటా ఇన్నోవేటర్ ఆవిష్కరణలు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. విద్యాశాఖ అధికారులతో పాటు పలు శాఖల అధికారులు పాఠశాలలతో పాటు, గ్రామాల్లో ఈ కార్యక్రమంపై విస్తృత అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. ప్రస్తుత సంవత్సరంలో జిల్లాలోని గ్రామీణ, పట్టణ ఔత్సాహికులు ఆవిష్కరణలతో తమ ప్రతిభకు పదునుపెట్టే అవకాశం ఉందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రభుత్వం కల్పిస్తోందని, ఆగస్టు 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఆవిష్కరణల ప్రదర్శన ఉంటుందని పేర్కొన్నారు. గ్రామీణుల ఆవిష్కరణ, విద్యార్థుల ఆవిష్కరణ, వ్యవసాయ రంగ ఆవిష్కరణలు, సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల ఆవిష్కరణలతో పాటు తదితర ఆవిష్కరణలను ప్రదర్శిస్తారన్నారు. ఆసక్తి గల వారు ఆవిష్కరణ పేరు, ప్రదర్శనకు గల రెండు నిమిషాల వీడియో, ఆవిష్కరణలకు సంబంధించిన నాలుగు ఫొటోలు, 100 పదాలతో రాసి తెలంగాణ ఇన్నోవేషన్ సెల్ వాట్సాప్ నంబరు 9100678543కు పంపాలని సూచించారు. పేరు, వయసు, ఫొటో, వృత్తి, గ్రామం పేరు, జిల్లా పేరుతో వివరాలతో పంపించాలన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇంటింటా ఇన్నోవేషన్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్వో సంగీత, డీఆర్డీఏ పీడీ శ్రీలత, డీపీవో సురేష్‌మోహన్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ వెంకటేశ్వరరావు, అటవీ శాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, డిస్ట్రిక్ట్ ఇన్నోవేషన్ కో-ఆర్డినేటర్ శ్రీకొబ్బన్న వాసు, అధికారులు పాల్గొన్నారు.



ఇంటింటా ఇన్నోవేషన్ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శశాంక



జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

వికారాబాద్, జూలై 9: జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని టీయూడబ్ల్యుజే జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసచారి కోరారు. రాష్ట్ర సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మంగళవారం కలిశారు. ఈ సందర్భంగా శ్రీనివాసచారి మంత్రితో మాట్లాడుతూ.. మృతిచెందిన జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకోవాలని కోరారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రాతినిథ్యం వహిస్తున్న వికారాబాద్ జిల్లా నుంచే జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టాలని కోరారు. గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న జర్నలిస్టులు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. కొందరు అనారోగ్యానికి గురై మెరుగైన వైద్యానికి నోచుకోక ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. అనారోగ్యంతో బాధపడే జర్నలిస్టులకు, వారి కుటుంబాలకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచిత వైద్యం అందేలా చూడాలని కోరారు. ఇళ్లులేని జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని, స్థలాలు ఉన్న వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయాలని విజ్ఞప్తిచేశారు. జర్నలిస్టులపై దాడులకు పాల్పడే వారిపై పీడీ యాక్ట్ నమోదు చేసి కఠిన చర్యలు తీసుకునే విధంగా జీవో తీసుకురావాలని కోరారు. ఉత్తమ జర్నలిస్టులకు అవార్డులను పునరుద్ధరించేలా చర్యలు తీసుకోవాలని ఆయన మంత్రికి విజ్ఞప్తి చేశారు.


మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసచారి

తాండూరు ఆర్టీసీ డిపో మేనేజర్ బదిలీ


సమత

తాండూరు, జూలై 9: దాదాపు రెండేళ్ల పాటు తాండూరు ఆర్టీసి డిపో మేనేజర్ పని చేసిన సమత బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో హైదరాబాద్ నగరంలోని ఉప్పల్ డిపోకు చెందిన కె.సురేష్ కుమార్‌ను నియమించారు. సమత తాండూరు డిపోలో ప్రయాణికులక మెరుగైన సేవలు అందించి అవార్డులను ఈ డిపోకు వచ్చేలా చేశారు. రాష్ట్రంలో పలు డిపోల మేనేజర్లకు బదిలీ చేస్తూ మంగళవారం ఉత్తర్వులు వెలువడ్డాయి. ఇందులో భాగంగా తాండూరు డిపో మేనేజర్ కూడ బదిలీ అయ్యారు.

గురుకుల కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు


ఐఎస్‌వో గుర్తింపు సర్టిఫికెట్‌ను చూపుతున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

ఘట్‌కేసర్ రూరల్, జూలై 9: అంకుషాపూర్‌లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ అండ్ పీజీ(బుద్వేల్) కళాశాలకు ఐఎస్‌వో గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ ఎం.వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ మేరకు అధ్యాపకులతో కలిసి ఆయన ఐఎస్‌వో గుర్తింపును కళాశాల అవరణలో ప్రదర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తమ కళాశాలకు ఐఎస్‌వో 14001-2015 ఎన్విరాన్‌మెంట్ మేనేజ్‌మెంట్, ఐఎస్‌వో 50001-2018 ఎనర్జీ మేనేజ్‌మెంట్ సిస్టమ్, ఐఎస్‌వో 21001-2018 ఎడ్యుకేషనల్ ఆర్గనైజేషన్స్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ వంటి వాటిల్లో సర్టిఫికెట్లు సాధించినట్లు తెలిపారు. అధ్యాపకులు సమష్టి కృషిచేయడం వల్లే ఉత్తమ ఫలితాలు వస్తుండటం వల్లే ఐఎస్‌వో సర్టిఫికెట్లు సాధించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కృష్ణ ప్రియ, అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు ఫిషర్స్ డే

మోమిన్‌పేట్, జూలై 9: మండల కేంద్రంలోని చేప పిల్లల కేంద్రం వద్ద బుధవారం ఉదయం 1 గంటలకు ఫిషర్స్ డే ఉత్సవాలను నిర్వహించనున్నట్లు మత్స్యశాఖ అధికారి సౌజన్య మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని మత్స్యకారులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆమె కోరారు.



విశ్రాంత ఉద్యోగుల సమస్యలు తీర్చాలి

వికారాబాద్, జూలై 9 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించే విధంగా రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు జొన్నల బస్వరాజ్ కోరారు. శ్రీసత్యసాయి జ్ఞాన కేంద్రంలో మంగళవారం సంఘం జిల్లా సమావేశానికి అధ్యక్షత వహించిన ఆయన మాట్లాడారు. అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్న విశ్రాంత ఉద్యోగులకు కార్పొరేట్ ఆస్పత్రుల్లో నగదు రహిత సేవలు అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. నాలుగు కరువు భత్యాలు మంజూరు చేయాలని, వికారాబాద్ జిల్లా కేంద్రంలో వెల్‌నెస్ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ-కుబేర్‌లో పెండింగ్‌లో ఉన్న బిల్లులన్నీ మంజూరు చేయాలని ఆయన విజ్ఞప్తిచేశారు. ఈ సందర్భంగా సంఘం కార్యదర్శి కామిడి నర్సింహారెడ్డి ప్రవేశ పెట్టిన తీర్మానాలను సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించి ప్రభుత్వానికి పంపించాలని నిర్ణయించారు. ఈ సమావేశంలో సంఘం కోశాధికారి మల్లయ్య, వికారాబాద్ యూనిట్ అధ్యక్షుడు మాణిక్‌ప్రభు, బందెప్పగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అసోసియేట్ అధ్యక్షుడు బస్వరాజ్

రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

ఘట్‌కేసర్, జూలై 9: ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిలో అవసరమైన సిబ్బందిని నియమించి ప్రజలకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఐద్వా ప్రతినిధులు డిమాండ్ చేశారు. ఘట్‌కేసర్ ప్రభుత్వాసుపత్రిని మంగళవారం సందర్శించి రోగులను, వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా ఐద్వా జిల్లా అధ్యక్షురాలు వినోద మాట్లాడుతూ.. ఆస్పత్రిలో ఓపీ సేవలు ముగిసిన అనంతరం సాయంత్రం. రాత్రి ఒకే డాక్టర్ అందుబాటులో ఉంటున్నారని దీంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని తెలిపారు. ఆస్పత్రిలో నాలుగో తరగతి ఉద్యోగులతో పాటు సెక్యూరిటీ కొరతతో రాత్రి సమయాల్లో రోగులు, వారి కుటుంబసభ్యులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని, పిల్లలకు అవసరమై సిరప్‌లకు తీవ్రమైన కొరత ఉందన్నారు. ఆసుపత్రిలో అన్ని పరికరాలు ఉన్నప్పటికీ నిపుణులు లేక వినియోగించలేక పోతున్నారని, తక్షణమే ప్రభుత్వం స్పందించి అవసరమైన సిబ్బందిని నియమించి రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సృజన, అరుణ, సబిత, నిరజ, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


ఘట్‌కేసర్ ఆస్పత్రి సందర్శనలో ఐద్వా ప్రతినిధులు





షాపింగ్ కాంప్లెక్స్ ప్రారంభించాలి


మేనేజర్ రాధికకు వినతి పత్రం ఇస్తున్న లక్ష్మీనర్సింహారెడ్డి

ఆమనగల్లు, జూలై 9: మండల కేంద్రంలోని విజయ పాలశీతలీకరణ కేంద్రం ఎదుట నిర్మించిన దుకాణ సముదాయాన్ని వెంటనే ప్రారంభించి చిరు వ్యాపారులకు కేటాయించాలని స్థానిక నేతలు, చిరు వ్యాపారులు పాలశీతలీకరణ కేంద్రం మేనేజర్ రాధికను కోరారు. మంగళవారం స్థానిక మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఉప సర్పంచ్ రామకృష్ణ ఆధ్వర్యంలో పాలశీతలీకరణ కేంద్రంలో మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. దశాబ్దాల కాలంగా దుకాణ సముదాయం నిర్మించాలని చిరు వ్యాపారుల, స్థానికుల కోరిక మేరకు బీఆర్ఎస్ ప్రభుత్వం దుకాణ సముదాయ నిర్మాణానికి రూ.46 లక్షలు కేటాయించినట్లు పేర్కొన్నారు. తాజా మాజీ ప్రజాప్రతినిధుల చొరవతో దుకాణ సముదాయం నిర్మాణం పూర్తయి రెండేళ్లవుతున్నా ప్రారంభించకపోవడంతో నిరూపయోగంగా మారాయని వారు తెలిపారు. దుకాణ సముదాయం ప్రారంభించి చిరు వ్యాపారులకు కేటాయిస్తే పాలశీతలీకరణ కేంద్రానికి ఆదాయం వస్తుందన్నారు. అదేవిధంగా దుకాణ సముదాయంలో ఒక దుకాణం కడ్తాల మండల మహిళా సమాఖ్యకు కేటాయించి.. మిగతా వాటిని చిరు వ్యాపారులకు అందజేయాలని గ్రామం పంచాయతీలో గ్రామ సభ ద్వారా ఆమోదింపబడిన తీర్మాన ప్రతిని ఈ సందర్భంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు నర్సింహ, లాయక్‌అలీ, గురిజ్ల రామచంద్రయ్య, గడ్డం నరేశ్ యాదవ్, కేశని బుచ్చయ్య, సిలువేరు కృష్ణయ్య, కంబాలపల్లి అంజి, సురేశ్, కానుగుల నర్సింహ, రాములు, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల తీరుపై న్యాయవాదుల నిరసన

ఆమనగల్లు, జూలై 9: భద్రాచలంలో న్యాయవాది కృష్ణ ప్రసాద్‌పై పోలీసులు వ్యవహరించిన తీరును నిరసిస్తూ ఆమనగల్లు బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. కోర్టు విధులను బహిష్కరించి బాధిత న్యాయవాదికి సంఘీభావం తెలిపారు. న్యాయవాదిపై పోలీసుల తీరును ఖండించారు. ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మల్లెపల్లి జగన్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయవాదుల పాత్ర కీలకమన్నారు. ప్రజల హక్కులను కాపాడడం కోసం ప్రజల తరఫున నిత్యం పోరాడే వ్యక్తులు న్యాయవాదులు మాత్రమేనని, అలాంటి వారిపట్ల పోలీసులు అమానుషంగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. ఈ విషయాన్ని తెలంగాణ బార్ కౌన్సిల్ దృష్టికి తీసుకెళ్లి కృష్ణప్రసాద్‌కు న్యాయం జరిగే వరకు పోరాడుతామని తెలిపారు. ఆమనగల్లు బార్‌అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు అంజనేయులు, జాయింట్ సెక్రటరీ రామకృష్ణ, ట్రెజరర్ మధు, లైబ్రేరియన్ శేఖర్, న్యాయవాదులు మల్లేశ్, జగన్‌గౌడ్, గణేశ్‌గౌడ్, శేఖర్ శ్రీనివాస్, సత్యనారాయణ, ఆంజనేయులు, సర్దార్ తదితరులు ఉన్నారు.


ఆమనగల్లు కోర్టు ఎదుట నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

అందుబాటులో ఉండరు.. చికిత్స చేయరు

» పశు వైద్యసేవలపై రైతుల ఆగ్రహం



డాక్టర్ నివేదితతో వాగ్వాదం చేస్తున్న పాడి రైతులు

కేశంపేట, జూలై 9: మండల పశువైద్యులు అందుబాటులో ఉండరని.. సమయానికి చికిత్స అందించడం లేదని పాడి రైతులు కేశంపేట పశువైద్య కేంద్రం ఎదుట ఆందోళన వ్యక్త చేశారు. మండల కేంద్రంతో పాటు అల్వాల, బొదునంపల్లి, చౌలపల్లి, కాకునూర్, లేమామిడి గ్రామాలకు చెందిన పాడి రైతులు మంగళవారం పశువైద్య కేంద్రానికి పశువులను చికిత్స నిమిత్తం తీసుకొచ్చారు. అయితే, పశువైద్యాధికారి లేకపోవడంతో ఆందోళనకు దిగారు. ఈక్రమంలో అక్కడికి వచ్చిన పశువైద్యాధికారి నివేదితతో వాగ్వాదానికి దిగారు. పశువులు రోగాలబారిన పడుతున్నా.. ఎందుకు చికిత్స అందిచడంలేదని ప్రశ్నించారు. ప్రభుత్వ వైద్యులు సక్రమంగా విధులు నిర్వహించకపోడంతో రైతు మిత్రలను ఆశ్రయించాల్సి వస్తుందని, వారు అధిక మొత్తంలో చార్జీ చేస్తున్నారని వాపోయారు. ఆసుపత్రిలో మందులు ఉన్నా ఇవ్వడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మందులను బయటకు తీసుకొచ్చి ప్రదర్శించారు. కేశంపేటకు వచ్చిన మందులను డాక్టర్ అమ్ముకుంటున్నారని ఆరోపించారు. కాగా, సిబ్బంది కొరతతోనే వైద్యసేవలు అందించడంలో అలస్యం జరుతుగుందని డాక్టర్ నివేదిత రైతులకు వివరించారు. రైతులు కేశంపేట ఎంపీడీవో రవిచంద్రకమార్ రెడ్డిని కలిసి విధులు పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కేశంపేట పశువైద్యాధికారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు.



శ్రీకాంత్‌రెడ్డికి బొకే అందజేసి సన్మానిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్, కె. శ్రీనివాస్‌రెడ్డి, యూనియన్ నాయకులు

కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డికి సన్మానం


రంగారెడ్డి అర్బన్, జూలై 9 : హెచ్‌యూజే ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ జర్నలిస్టు సంఘం రాష్ట్ర కార్యదర్శిగా ఎన్నికైన కొంపల్లి శ్రీకాంత్‌రెడ్డిని మంగళవారం మంత్రి పొన్నం ప్రభాకర్, మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి ఘనంగా సన్మానించారు. వారితో పాటు మీడియా అకాడమీ మాజీ చైర్మన్లు దేవులపల్లి అమర్, నరేందర్‌రెడ్డి, రాష్ట్ర యూనియన్ అధ్యక్షుడు విరాహత్ అలీ, జాతీయ నాయకులు కల్లూరి సత్యనారాయణ, హైదరాబాద్ యూనియన్ ఆఫ్ జర్నలిస్ట్ అధ్యక్షుడు శిగ శంకర్, కార్యదర్శి షౌకత్ తదితరులు సన్మానించారు.



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ విజయలక్ష్మి

మున్సిపాలిటీ అభివృద్ధికి కృషి

శంకర్‌పల్లి, జూలై 9 : పట్టణ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్‌పర్సన్ విజయలక్ష్మి ప్రవీణ్‌కుమార్ తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపాలిటీ పరిధిలోని బుల్కాపూర్‌లో మంగళవారం టీయూఎఫ్‌ఐడీసీ నిధులతో చేపట్టే సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మున్సిపాలిటీలో మౌలిక సదుపాయాల కల్పనకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానన్నారు. జిల్లాలోనే శంకర్‌పల్లి మున్సిపాలిటీని ఆదర్శంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. వర్షాకాలంలో పట్టణ ప్రజలు అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాల్లో చెత్తాచెదారం, నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు లక్ష్మమ్మరాంరెడ్డి, గోపాల్ తదతరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జడ్జి దశరథ రామయ్య

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

» సీనియర్ సివిల్ న్యాయాధికారి దశరథ రామయ్య

చేవెళ్ల, జూలై 9 : విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి ఉన్నతంగా చదువుకోవాలని చేవెళ్ల కోర్టు సీనియర్ సివిల్ న్యాయాధికారి దశరథ రామయ్య సూచించారు. మంగళవారం చేవెళ్ల మండల కేంద్రంలోని మోడల్‌స్కూల్, జూనియర్ కళాశాలలో ర్యాగింగ్ నిరోధక చట్టం, విద్యార్థులకు రక్షణ, డ్రగ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ.. కళాశాలలోచదువుకునే విద్యార్థులు తోటి విద్యార్థులను ర్యాగింగ్ చేయడం చట్టరీత్యా నేరమన్నారు. డ్రక్స్ తీసుకుని జీవితాలను పాడుచేసుకోవద్దని సూచించారు. చెడు వ్యసనాలు, ఆలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువుకుని సమాజాభివృద్ధిలో భాగస్వాములు కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల సీఐ. భూపాల్ శ్రీధర్, పాఠశాల ప్రిన్సిపాల్ టేనవతి, బార్‌అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గౌతమ్‌రెడ్డి, లీగల్ కౌన్సిల్ కుమార్, నవ్యాయవాదులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు ఉన్నారు.

నిధుల మంజూరుకు కాంగ్రెస్ నేతల వినతి

తలకొకండపల్లి, జూలై 9: తలకొండపల్లి గ్రామ కాంగ్రెస్ నాయకులు మంగళవారం కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో కలిసి సీసీ రోడ్లు, అంతర్గత మురుగు కాలువలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించాలని పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఎమ్మెల్యేకు అందజేశారు. ఆయా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చినట్లు తెలిపారు. డీసీసీ ప్రధాన కార్యదర్శి రవీందర్‌యాదవ్, నియోజకవర్గ సోషల్ మీడియా ఇన్‌చార్జి అజీమ్, బ్లాక్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి డిగ్రీ కృష్ణ, మైనారిటీ సెల్ మండలాధ్యక్షుడు ఆరిఫ్, నాయకులు తుమ్మ నర్సింహ, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలి

» డీఎల్‌పీవో శంకర్‌నాయక్

పెద్దేముల్, జూలై 9: శుభ్రతను పాటించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల జాగ్రత్త వహించాలని డీఎల్‌పీవో శంకర్‌నాయక్ అన్నారు. మండలంలోని మంబాపూర్ గ్రామ సమీపంలోని మహాత్మాజ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను ఆయన మంగళవారం సందర్శించారు. గురుకుల పాఠశాలలోని గదులను పరిశీలించారు. కిచన్‌షెడ్, తాగు నీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల పరిస్థితిని తనిఖీ చేశారు. తాగునీటి సరఫరా చేసే ట్యాంకును ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలని అక్కడి సిబ్బందిని ఆదేశించారు. బ్లీచింగ్‌పౌడర్ చల్లించి శానిటేషన్ పక్కాగా నిర్వహింపజేయాలని ప్రిన్సిపల్‌కు సూచించారు. ఏమాత్రం అజాగ్రత్త వహించినా పిల్లల ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం వహించినా ప్రభుత్వం చర్యలు తీసుకునేందుకు వెనకాడదని చెప్పారు. వంటలు చేసే సమయంలో వంట ఏజెన్సీ వారు శుభ్రతను పాటిస్తున్నారా? లేదా? అనే విషయాన్ని పరిశీలిస్తుండాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. పాఠశాల, కిచన్ పరిసరాల్లో ఎక్కడా మురుగునీరు నిలవకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం ఆత్కూర్, రుద్రారం గ్రామాల్లో పర్యటించి పారిశుధ్యనిర్వహణపై ఆరాతీశారు. గ్రామాల్లో పరిశుభ్రతను నెలకొల్పాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. ఆయన వెంట ఇన్‌చార్జి ఎంపీవో రమేష్, పంచాయతీ కార్యదర్శి సంజీవ్‌కుమార్ ఉన్నారు.

గ్రామశివారు బోర్డు ఏర్పాటు

మంబాపూర్ గ్రామ శివారులో మంగళవారం డీఎల్‌పీవో శంకర్‌నాయక్ స్వాగత బోర్డును ఏర్పాటు చేయించారు. అన్ని పంచాయతీల్లో గ్రామ శివారు బోర్డులు ఏర్పాటు చేయిస్తున్నామని తెలిపారు.



మహాత్మాజ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో తాగునీటి రుచి చూస్తున్న డీఎల్‌పీవో

గ్రామంలోకి వచ్చేవారికి స్వాగతం చెబుతున్నట్లు, గ్రామ శివారుదాటి వెళ్లి పోయే వారికి ఆగ్రామం తరుపు ధన్యవాదాలు తెలుపుతున్నట్లు ఉంటాయని చెప్పారు. అంతే కాకుండా ఏగ్రామ శివారు ఎక్కడి నుంచి ప్రారంభమవుతుంది. ఎక్కడి వరకు శివారు ముగుస్తుందనే విషయం కూడా దీని వల్ల అందరికీ తెలిసిపోతుందని అన్నారు.

పోలీస్ సిబ్బంది ఒత్తిడి లేకుండా పనిచేయాలి

» వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి



మాట్లాడుతున్న ఎస్పీ నారాయణరెడ్డి

వికారాబాద్, జూలై 9 : పోలీస్ సిబ్బంది ఎలాంటి ఒత్తిడి లేకుండా పనిచేయాలని ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. ఎస్పీ కార్యాలయంలో మంగళవారం ఏఆర్ పోలీస్ అధికారులతో పరిచయ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పోలీస్ సిబ్బంది, అధికారులు ప్రశాంతమైన వాతావరణంలో క్రమశిక్షణతో ఓపికతో విధులు నిర్వర్తించాలని సూచించారు. ప్రతి ఒక్కరుబాధ్యతగా విధులు నిర్వర్తించాలన్నారు. అత్యవసరమైన సమయంలో ప్రతీఒక్కరు అందుబాటులో ఉండాలని, ప్రతీఒక్కరు తెలంగాణ పోలీస్ శాఖకు, జిల్లా పోలీసుకు మంచి పేరు వచ్చే విధంగా పనిచేయాలన్నారు. సమయపాలన క్రమశిక్షణను ప్రతీఒక్కరు పాటించాలని, ప్రతీఒక్కరు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధపెట్టాలన్నారు. ఎలాంటి చెడు అలవాట్లకు లోనుకుండా ఆరోగ్యంగా ఉండాలని, పోలీస్ అధికారులు, సిబ్బంది శాఖాపరమైన పనులపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో డీటీసీ అదనపు ఎస్పీ పీవీ మురళీధర్, ఆర్ఐలు అంజాత్‌పాషా, డేవిడ్ విజయ్‌కుమార్, ఆర్ఎస్ఐ, ఏఆర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న పోలెపల్లి నాయకులు

సకల సదుపాయాలతో ఆసుపత్రి నూతన భవన నిర్మాణం

» కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

ఆమనగల్లు, జూలై 9: ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రికి అత్యాధునిక సదుపాయాలతో నూతన భవనం నిర్మిస్తున్నట్లు కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి తెలిపారు. 50 పడకల ఆసుపత్రి భవన నిర్మాణానికి బుధవారం భూమిపూజ చేస్తున్నట్లు తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో అసంపూర్తి పనులను పూర్తి, ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రి భవన నిర్మాణంపై మంగళవారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో అధికారులతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించారు. భవన నిర్మాణం పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తిచేసి వినియోగంలోకి తేవాలని, ప్రభుత్వం రూ.17.50 కోట్లు కేటాయించినట్లు పేర్కొన్నారు. అదనంగా భవనానికి మరో రూ.10 కోట్లు కేటాయించాలని సీఎంను కోరగా సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ ఆసుపత్రులను కార్పొరేట్‌కు దీటుగా ఆధునీకరించి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించనున్నట్లు తెలిపారు. వెల్దండ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నూతన భవన నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించాలని మంత్రి దామోదర రాజనర్సింహను ను కలిసి విన్నవించగా.. అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. కడ్తాల మండలం కేంద్రంలో త్వరలో ప్రభుత్వ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. తలకొండపల్లి, ఇర్విన్, మైసిగండి, గట్టిప్పలపల్లి ప్రభుత్వ ఆసుపత్రుల స్థాయి పెంచి రోగులకు మెరుగైన వైద్యసదుపాయాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కాగా, ఆమనగల్లు మండలం పోలెపల్లి గ్రామ సమీపంలోని దేవర గుట్టపై నందీశ్వర ఆలయ నిర్మాణానికి ప్రభుత్వపరంగా సహకరించాలని స్థానిక నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. సమావేశంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్, ఆమనగల్లు మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్‌రెడ్డి, ఆమగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు శంకర్, సూదిని కొండల్‌రెడ్డి, అజీమ్, రవియాదవ్, జగన్‌గౌడ్, తదితరులు ఉన్నారు.

పరిశ్రమలకు రాయితీని అమలు చేయాలి



అధికారులకు వినతిపత్రాన్ని అందజేస్తున్న నాపరాయి పరిశ్రమల ప్రతినిధుల బృందం

తాండూరు, జూలై 9: కర్ణాటక తరహా రాయల్టీని తాండూరు ప్రాంతంలోని నాపరాయికి అమలు చేయాలని రాష్ట్ర గనుల శాఖ సెక్రటరీ సురేంద్రమోహన్, డైరెక్టర్ సుశీల్ కుమార్‌లను కోరారు. తాండూరు స్టోన్ అసోసియేషన్, క్వారి మర్చంట్స్ అసోసియేషన్‌ల ప్రతినిధుల బృందం మంగళవారం అధికారులను కలిసి సమగ్ర వివరాలను అందజేశారు. ఈ ప్రాంతంలో అధిక రాయల్టీ వసూలు చేయడం వల్ల సుద్ద, నాపరాయి పరిశ్రమల మనుగడ కష్టమవుతుందన్నారు. ప్రభుత్వానికీ ఆదాయం తగ్గుతుందని ఈ బృందం అధికారులకు వివరించింది. అధిక రాయల్టీ కొనసాగిస్తే భవిష్యత్తులో పరిశ్రమలు మూతబడే పరిస్థితి ఏర్పడుతుందని వారు తెలిపారు. ప్రభుత్వం సుద్ద, నాపరాయి పరిశ్రమలను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి ఎన్నికల సమయంలో సుద్ద, నాపరాయి వ్యాపారులకు ఈ విషయమై హామీ ఇచ్చారని క్వారీ, స్టోన్ వెల్ఫేర్ అసోసియేషన్‌అధ్యక్షుడు అబ్దుల్ రవూఫ్, నయీం తెలిపారు. ఈమేరకు సుద్ద, నాపరాయి పరిశ్రమలను ఆదుకోవడానికి అవకాశముందన్న అంశాలపై అధ్యాయనం చేస్తామని డైరెక్టర్ హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు జుబేర్ లాల, సుజీవ్, నర్సింహులు ఫయాజ్, జయివుద్దీన్‌లు ఉన్నారు.

‘స్వీయ పార్లమెంట్ ఎన్నికల నిర్వహణ’ అభినందనీయం



కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాల్వాయి హరీష్, పరమ పూజ్య సుఖ వల్లభదాస్ జీ, రత్నం, తదితరులు

మొయినాబాద్ రూరల్, జూలై 9: విద్యార్థులతో స్వీయ పార్లమెంటు ఎన్నికల కార్యక్రమం నిర్వహించడం అభినందనీయమని సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు అన్నారు. మండల పరిధిలోని హిమాయత్ నగర్ చౌరస్తాలోని స్వామినారాయణ్ గురుకుల్ పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన స్వీయ పార్లమెంటు ఎన్నికల కార్యక్రమం మంగళవారం ముగిసింది. ఇందులో భాగంగా విద్యార్థులు ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలను నిర్వహించారు. ఎన్నికల్లో గెలుపొందిన విద్యార్థులు కెప్టెన్, వైస్ కెప్టెన్, హౌస్ కెప్టెన్, హౌస్ మానిటర్స్, క్లాస్ మానిటర్స్, డిసిప్లైన్ మానిటర్స్ వంటి వివిధ రంగాల్లో ఎన్నుకోబడ్డారు. ఈ సందర్భంగా విద్యార్థి నాయకులకు పదవీ బాధ్యతల స్వీకరణ నిమిత్తం స్వీయ పార్లమెంట్ సమావేశాన్ని నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. సిర్పూర్ ఎమ్మెల్యే డాక్టర్ పాల్వాయి హరీష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థుల ప్రతిభను వీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కుల,మత వర్ణ, వర్గ బేధాలు లేకుండా ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమని చెప్పారు. ఇలాంటి పాఠశాలలు మా ప్రాంతంలో కూడా నెలకొల్పి ఎంతో మంది పేద విద్యార్థులను తీర్చిదిద్దాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో గురుకుల్ విద్యాసంస్థల పరమ పూజ్య సుఖ వల్లభదాస్ జీ, విశ్వదర్శన్ స్వామిజీ, మాజీ ఎమ్మెల్యే రత్నం, హాస్టల్ ప్రిన్సిపాల్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపక బృందంతో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమతంగా ఉండాలి



కొత్తూర్ : సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ బాలాజీ

కొత్తూర్, జూలై 9: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమతంగా ఉండాలని స్థానిక పీహెచ్‌సీ డాక్టర్ హరికిషన్, మున్సిపల్ కమిషనర్ బాలాజీలు సూచించారు. మున్సిపల్ కార్యాలయంలో మున్సిపాలిటీ, వైద్య శాఖ ఆధ్వర్యంలో ఆశ వర్కర్లకు మంగళవారం ఏర్పాటుచేసిన సమావేశంలో వారు పాల్గొని పలు సూచనలు చేశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని, వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. కాచి వడపోసిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాజు, పీహెచ్‌సీ సిబ్బంది చిట్టిబాబు, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో జాగ్రత్తలు పాటించాలి

శంకర్‌పల్లి : వర్షాకాలంలో ప్రజలు రోగాల బారిన పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలని శంకర్‌పల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ తెలిపారు. శంకర్‌పల్లి మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం సీజనల్ వ్యాధుల నివారణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వర్షాకాలంలో అంటు వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇంటి పరిసరాలలో నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలన్నారు. ఎక్కువడితే అక్కడ చెత్తాచెదారం వేయరాదన్నారు. మున్సిపల్ వాహనాల్లోనే చెత్త వేయాలని తెలిపారు. వర్షపునీరు, మురుగు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి రేవతి, మున్సిపల్ మేనేజర్ అంజన్‌కుమార్, టీఎంసీఆర్ అనూష ఆశావర్కర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు ఉన్నారు.



శంకర్‌పల్లి : మాట్లాడుతున్న శంకర్‌పల్లి వైద్యాధికారి రేవతి



బీజేవైఎం కేశంపేట మండలాధ్యక్షుడిగా పాలాది శ్రీనివాస్

కేశంపేట, జూలై 9: బీజేవైఎం కేశంపేట మండలాధ్యక్షుడిగా కొత్తపేట గ్రామానికి చెందిన పాలాది శ్రీనివాస్‌ను నియమించారు. మంగళవారం శంషాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో శ్రీనివాస్‌కు బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీశ్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీవర్ధన్‌రెడ్డి, బాబయ్య, కేశంపేట మండలాధ్యక్షుడు రాఘురాములుగౌడ్‌లు నియమాకపత్రం అందించారు. జిల్లా కాసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మోటే శ్రీనివాస్, బీజేవైఎం అధికార ప్రతినిధి శివాజీ, తట్టిపల్లి నర్సింలు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యకు పరిష్కారం

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

చౌదరిగూడ, జూలై 9: మండలలలో పేరుకపోయిన విద్యుత్ సమస్యలపై గత ఆదివారం ‘ఆంధ్రజ్యోతి’లో పేరుకుపోతున్న విద్యుత్ సమస్యలు అనే కథనం ప్రచురితమైంది. ఈమేరకు స్పందించిన ట్రాన్స్‌కో అధికారులు పెద్దఎల్కిచర్ల గ్రామం వీరాపూర్‌కు వెళ్లే మార్గంలో ఒరిగిన విద్యుత్ స్తంభాన్ని ఎక్స్‌వేటర్ సాయంతో సరిచేశారు. అలాగే విద్యుత్ అంతరాయానికి కారణమవుతున్న చెట్లకొమ్మలను నరికివేశారు. కిందకు వేలాడుతున్న తీగలను సరిచేశారు. ఈమేరకు ఆయా గ్రామాల ప్రజలు అధికారులను అభినందించారు.



పెద్ద ఎల్కిచర్లలో విద్యుత్ వైర్లను సరిచేస్తున్న సిబ్బంది



దశరథ్ నాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

పదవిలో లేకున్నా సేవలందిస్తా

కడ్తాల్, జూలై 9: పదవులు ఉన్నా లేకపోయిన నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సేవలు అందిస్తానని కడ్తాల మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్ అన్నారు. పదవులు శాశ్వతం కాదని.. చేసిన పనులు మాత్రం చిరస్థాయిగా ఉంటాయని తెలిపారు. కడ్తాల జడ్పీటీసీగా ఐదేళ్లు చేసుకున్న సందర్భంగా దశరథ్ నాయక్‌కు కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. దశరథ్ నాయక్‌ను స్థానిక నాయకులు పూలమాలలు, శాలువాలతో సత్కరించి అభినందించారు. మండల అభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో నాయకులు జోగు వీరయ్య, మహేశ్, శంకర్, మోతిలాల్, శ్రీకాంత్, శ్రీను, సురేశ్, మల్లేశ్, కృష్ణ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వానాకాలంలో అవస్థ

» జలమయమవుతున్న బషీరాబాద్ గ్రామపంచాయతీ భవనం

» నూతన భవనానికి నిధులు మంజూరైనా పట్టించుకోని వైనం

బషీరాబాద్, జూలై 9: బషీరాబాద్ గ్రామ పంచాయతీ భవనం వర్షం నీటి నిల్వతో జలమయమై ఇటు అధికారులు, అటు ప్రజలు అవస్థలు పడుతున్నారు. వానాకాలమొస్తే చాలు ఇక్కడి భవనం ఎదుట నిలిచిన వర్షం నీటితో ఆ పరిశుభ్రత వాతావరణం నెలకొని లోపాలికి వెళ్ల లేని దుస్థితిని ఎదుర్కొంటున్నారు. ఈ వర్షం నీటి పారుదలకు ఎలాంటి ఆవకాశం లేకపోవడంతో నీరంతా రోజుల తరబడి ఆవరణలో నిలుస్తోంది. ఫలితంగా పంచాయతీ భవనంలోకి వెళ్లేందుకు కాలు కూడా పెట్టలేని పరిస్థితి ఇక్కడా ఉంది. అయితే ఈ పంచాయతీ భవనం నుంచే గ్రామ పరిపాలన సాగిస్తున్న ప్రత్యేకాధికారి, కార్యదర్శి మాత్రం ఆపరిశుభ్రంగా ఉన్న నీటిలోంచే రాకపోకలు సాగిస్తూ విధులు నిర్వరిస్తున్నారు. ఇదిలా ఉండగా నూతన పంచాయతీ భవన నిర్మాణానికి ఏడాది కిందటే రూ.20 లక్షల ఈజీఎస్ నిధులు మంజూరైన ఏ ఒక్కరూ కూడా పట్టించుకోకపోవడం గమనార్హం.



పంచాయతీ ఆవరణలో నిలిచిన వర్షపు నీరు

హామీల అమలులో కాంగ్రెస్ విఫలం

- బీజేపీ కిసాన్ మోర్చా నాయకులు
- రైతు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్
- తహసీల్దార్ కార్యాలయాల్లో వినతి పత్రాలు సమర్పణ



మహేశ్వరం : ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న మోర్చా నాయకులు

మహేశ్వరం, జూలై 9 : ఎన్నికల ముందు రాష్ట్ర రైతాంగానికి ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ అమలు చేయకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కల్లబొల్లి మాటలు చెబుతూ కాలయాపన చేస్తోందని బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి పోతర్ల సుదర్శన్‌యాదవ్ అన్నారు. రైతుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం మహేశ్వరం ఇన్‌చార్జి తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను మోసం చేయడానికి కమిటీలు వేస్తుందే తప్పా.. అవి కార్యరూపం దాల్చడానికి కాదన్నారు. రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ, రైతు భరోసా, కౌలురైతులకు, వ్యవసాయ కూలీలకు కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఆర్థిక తోడ్పాటు, పంటల బీమా వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు కిసాన్ మోర్చా రైతులకు అండగా ఉంటుందన్నారు. నాయకులు ఎ. యాదయ్యగౌడ్, దేశ్యానాయక్, నర్సింహగౌడ్, శ్రీనివాస్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

షాద్‌నగర్ అర్బన్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా అన్నదాతలకు ఇచ్చిన హామీలను అమలు పర్చాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలు డిమాండ్ చేశారు. రైతుల సమస్యలపై బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా పిలుపు మేరకు ఫరూఖ్‌నగర్ మండల తహసీల్దార్ కార్యాలయం ఎదుట నాయకులు ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్‌కు వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా అందె బాబయ్య, పాలమూరు విష్ణువర్ధన్‌రెడ్డిలు మాట్లాడారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రైతులకు లక్ష రూపాయల రుణమాఫీ చేయలేదని.. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేసి అధికారాన్ని అప్పగిస్తే.. నేటి వరకు రుణమాఫీ చేయడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు ఎకరాకు పెట్టుబడి సాయం కింద రూ.15వేలు, కౌలు రైతుకు రూ.12వేలు, రైతు కూలీలకు రూ.12 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫసల్ బీమా పథకాన్ని సైతం రాష్ట్రంలో అమలు చేసి, ప్రకృతి వైపరీత్యాల సమయంలో రైతులను ఆదుకోవాలని కోరారు. వ్యవసాయ ఉత్పత్తులకు ఇస్తామన్న 500 రూపాయల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమం కోసం ఎరువులపై ఎకరాకు రూ.18వేల సబ్సిడీని కేంద్రం ఇస్తున్నదని గుర్తుచేశారు. రైతులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పతనం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మల్చలం మురళి, చెట్ల వెంకటేష్, వంశీకృష్ణ, మఠం రుషీకేష్, భూషన్, రామకృష్ణ, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్ అర్బన్ : ఫరూఖ్‌నగర్ డీటీకి వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు



మొయినాబాద్ రూరల్ : వినతిపత్రం అందజేస్తున్న లక్ష్మీపతి యాదవ్ తదితరులు

మొయినాబాద్ రూరల్ : అసెంబ్లీ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రభుత్వం ఏర్పడి రెండువందల రోజులు అవుతున్నా అమలు చేయడం లేదని బీజేపీ కిసాన్ మోర్చా మొయినాబాద్ మండలాధ్యక్షుడు లక్ష్మీపతి యాదవ్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులతో కలిసి మొయినాబాద్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం లక్ష్మీపతియాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారంటీలను నెరవేర్చలేదన్నారు. బీజేపీ ఓబీసీ జిల్లా కార్యదర్శి ఎల్గని వెంకటేష్‌గౌడ్, బీజేవైఎం మండలాధ్యక్షుడు శ్రీకాంత్, పార్టీ ప్రధాన కార్యదర్శి తూర్పు మాధవరెడ్డి, ఉపాధ్యక్షుడు తూర్పు శ్రీనివాస్‌రెడ్డి, వన్నాడ శివకుమార్, చంద్రశేఖర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, నక్కలపల్లి మధు, ప్రవీణ్ సంజీవరెడ్డి, శ్రీనివాస్ గౌడ్, విజయ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

చౌదరిగూడ : కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సమస్యలను పరిష్కరించాలని కిసాన్‌మోర్చా చౌదరిగూడ మండలాధ్యక్షుడు వెంకటేష్ డిమాండ్ చేశారు. బీజేపీ నాయకులతో కలిసి తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలన్నారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కమ్మరి భూపాలచారి, జిల్లా కార్యవర్గసభ్యుడు కోనేరు శ్రీనివాస్, మండలాధ్యక్షుడు బోయ కురుమయ్య, హనుమాన్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల : కాంగ్రెస్ హామీలను సక్రమంగా అమలు చేయాలని డిమాండ్ చేస్తూ కిసాన్ మోర్చా, బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయంలో వినతిప్రతం అందించారు. కిసాన్ మోర్చా మండలాధ్యక్షుడు ఉమాశంకర్‌రెడ్డి, బీజేపీ చేవెళ్ల మండల ప్రధాన కార్యదర్శి అనంత్‌రెడ్డిలు మాట్లాడుతూ కాంగ్రెస్ ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మధుకర్‌రెడ్డి, శ్రీనివాస్, అశోక్, తదితరులు ఉన్నారు.



చౌదరిగూడ : తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు



చేవెళ్ల : వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

క్రైం కార్నర్

ఇళ్లలో పనికి కుదిరి..
బంగారం, నగదు అపహరణ

- చోరీలకు పాల్పడుతున్న భార్యభర్తలతో పాటు మరో ముగ్గురు అరెస్ట్
- నిందితులు నేపాల్‌వాసులు.. 13.5తులాల బంగారం, రూ.25వేలు రికవరీ



రికవరీ చేసిన బంగారం

షాద్‌నగర్ రూరల్, జూలై 9 : ఇళ్లల్లో పని చేస్తూ చోరీలకు పాల్పడుతున్న నేపాల్‌కు చెందిన భార్యా భర్తలను షాద్‌నగర్ పోలీసులు మంగళవారం అరెస్ట్‌చేసి రిమాండ్‌కు పంపారు. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రాంరెడ్డి కథనం ప్రకారం.. జూన్ 30న ఆదివారం అయ్యప్ప కాలనీకి చెందిన గాదం రమేష్ భార్య, కుమారుడు, కోడలు కర్నూలుకు పని నిమిత్తం వెళ్లగా.. రమేష్ హైదరాబాద్‌కు వెళ్లాడు. అయితే, నేపాల్‌కు చెందిన ప్రసన్న బదువాల్ వారి ఇంట్లో గత 8 నెలలుగా పనిచేస్తోంది. ఆమె భర్త ప్రశాంత్‌తో కలిసి షాద్‌నగర్‌లో అద్దె ఇంట్లో ఉంటోంది. ఈక్రమంలో వారు ఆర్థికంగా ఉన్న వారి ఇళ్లల్లో పని చేస్తూ.. కుటుంబ సభ్యులు, ఇంటి యజమానుల కదలికలను గమనించేవారు. దాంతో ప్రసన్న నేపాల్‌లో ఉండే తన అక్క, భర్త, మరో ఇద్దరిని ఇక్కడికి రప్పించుకుంది. పథకం ప్రకారం వారితో కలిసి రమేష్ కుటుంబ సభ్యులు ఇంట్లో లేని సమయంలో 9 తులాల బంగారం, రూ.2.50 లక్షల నగదు అపహరించుకుపోయారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు శంషాబాద్ ఎస్వోటీ విచారణ చేపట్టింది. సాంకేతిక ఆధారాలతో నేరస్తులను గుర్తించారు. దొంగిలించిన సొత్తుతో మంగళవారం నేపాల్ పారిపోతుండగా షాద్‌నగర్ బస్టాండ్‌లో ప్రసన్న, ఆమె భర్త ప్రశాంత్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి షాద్‌నగర్‌లో జరిగిన వేర్వేరు కేసులకు సంబంధించి 13.5 తులాల బంగారం, రూ.25వేల నగదు స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు నేపాల్ పారిపోయినట్లు డీఐ తెలిపారు.

తాళం వేసిన ఇంటికి కన్నం

కడ్తాల్, జూలై 9 : తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగిన ఘటన మండల కేంద్రంలో సోమవారం రాత్రి జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండల కేంద్రానికి చెందిన ఇల్లందుల వనిత బంధువులతో కలిసి తిరుపతి పుణ్యక్షేత్రానికి వెళ్లింది. ఈక్రమంలో మంగళవారం ఉదయం చుట్టుపక్కల వారు ఇంటి తలుపులు తెరచి ఉండడం గమనించారు. ఇంట్లోకి వెళ్లి చూడగా అల్మారా తెరిచి ఉంది. వెంటనే వారు వనితకు ఫోన్ చేసి చోరీ జరిగిందని చెప్పారు. అనంతరం ఆమె పోలీసులకు సమాచారం అందించింది. దాంతో సీఐ శివప్రసాద్ ఇంట్లో నిశితంగా పరిశీలించారు. బాధిత మహిళకు ఫోన్ చేసి ఇంట్లో ఉన్న వస్తువుల వివరాలపై ఆరా తీయగా.. నాలుగు తులాల బంగారంతో పాటు కొంత నగదు ఉందని సమాచారమందించింది. క్లూస్‌టీంతో వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మహిళ మెడలోంచి పుస్తెలతాడు అపహరణ

కొందుర్గు, జూలై 9: మహిళా మెడలోంచి బంగారు పుస్తెలతాడు అపహరించిన ఘటన మండల పరిధిలోని మహాదేవ్‌పూర్‌లో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన కాలపురం మంజుల మహాదేవ్‌పూర్ నుంచి తన తల్లిగారి ఊరు అయిన చిన్న ఉమ్మెంత్యాలకు వెళ్లేందుకు మహాదేవ్‌పూర్ నుంచి రాంచంద్రాపూర్‌కు మంగళవారం సాయంత్రం నడుచుకుంటూ చెరువు కట్టపై నుంచి వెళుతోంది. ఈక్రమంలో ఇద్దరు వ్యక్తులు పల్సర్ బైక్‌పై వచ్చి.. ఆమెకు ఎదురుగా బైక్ ఆపి మెడలో ఉన్న బంగారు పుస్తెలతాడు ఇవ్వమని బెదిరించారు. ఆమె ప్రతిఘటించడంతో పుస్తెలతాడును లాక్కొని వెళ్లారు. ఆ సమయంలో రామచంద్రాపూర్ నుంచి వస్తున్న ఉత్తరాస్‌పల్లి గ్రామానికి చెందిన ఆదిల్, హమీద్‌లు దొంగలను వెంబడించారు. దొంగలు ఉత్తరాస్‌పల్లి వైపు వెళ్లడంతో, ఉత్తరాస్‌పల్లి రోడ్డు పక్కన క్రికెట్ ఆడుతున్న వారికి హమీద్, ఆదిల్‌లు ఫోన్ చేసి, దొంగలను పట్టుకొమ్మని చెప్పారు. దాంతో ఆ యువకులు ఇద్దరు దొంగలను పట్టుకున్నారు. అయితే, దొంగలు ఫైలార్‌దేవునిపల్లి గ్రామానికి చెందిన దుర్గాప్రసాద్, కొత్తూర్ జనార్ధన్ అని తెలిసింది. మంజుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకోని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనయ్య తెలిపారు.

క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతి

కొందుర్గు, జూలై, 9: మండల కేంద్రం శివారులో ఉన్న ఓ క్రషర్ క్వారీ గుంతలో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన మంగళవారం సాయంత్రం జరిగింది. స్థానికులు తెలిపిన కథనం మేరకు.. నల్గొండ జిల్లా శాలిగౌరారం మండల పరిధిలోని గురిజాల గ్రామానికి చెందిన రవి (40) కంప్రెసర్ పనులు చేస్తుంటాడు. అందులో భాగంగా మంగళవారం క్రషర్‌లో పని చేస్తుండగా పక్కనే ఉన్న క్వారీ గుంతలో పడి మృతి చెందాడు. మృతదేహాన్ని షాద్‌నగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయమై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

చికిత్స పొందుతూ మరొకరు..

ఆదిబట్ల, జూలై 9 : రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటన ఆదిబట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం రాత్రి చోటుచేసుకుంది. ఆదిబట్ల ఎస్సై వెంకటేష్ తెలిపిన వివరాల ప్రకారం.. అమియా కుమాదాస్ కుటుంబ సభ్యులతో కలిసి అబ్దుల్లాపూర్‌మెట్ మండలం మన్నెగూడలో నివాసం ఉంటున్నాడు. ఈనెల 8న సాయంత్రం 7 గంటల ప్రాంతంలో వాకింగ్ కోసమని అపార్టుమెంట్ బయటకు వచ్చాడు. అదే సమయంలో మన్నెగూడ నుంచి బొంగ్లూరు వైపు అతి వేగంగా వెళ్తున్న బైక్ అతడిని ఢీకొట్టింది. తలకు బలమైన గాయాలు కావడంతో కామినేని ఆస్పత్రికి తరలించగా చికిత్సపొందుతూ సోమవారం రాత్రి మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. మృతుడి కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఘనంగా ఏబీవీపీ ఆవిర్భావ వేడుకలు



మహేశ్వరం : విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

కడ్తాల, జూలై 9: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) 76వ ఆవిర్భావ వేడుకలు కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఏబీవీపీ సీనియర్ నాయకులు బొల్లం మురళీ జెండాను ఆవిష్కరించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ దేశంలో అతిపెద్ద విద్యార్థి సంఘంగా ఏబీవీపీ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలతో పాటు దేశాభ్యున్నతి కోసం ఏబీవీపీ పని చేస్తుందన్నారు. విద్యార్థుల్లో సేవా భావాన్ని పెంపొందించడానికి స్టూడెంట్ ఫర్ సేవ, విద్యార్థుల అభివృద్ధికి స్టూడెంట్ ఫర్ డెవలప్‌మెంట్ వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు దోనాదుల మహేశ్, కాంటేకార్ భగీరథ్, దశరథ్, వంశీ, నందీశ్వర్, సిద్దార్థ్, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

మహేశ్వరం : దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక యువతలో బానిసత్వాన్ని తొలగించి.. వారిని జాగృతి పరిచేందుకు ఏబీవీపీ ఎంతో కృషి చేసిందని మహానగర కార్యదర్శి శ్రీకాంత్ అన్నారు. మహేశ్వరంలో విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ 75 సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యలపై పోరాటాలు చేస్తున్న ఏబీవీపీ మున్ముందు కూడా విద్యార్థుల సమస్యలపై అలుపెరుగని పోరాటాలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో రాఘవేందర్, దుర్గాప్రసాద్, సాయిచరణ్, ధనుష్, అభిలాష్, రోహిత్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తూర్ : ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవాన్ని మండల కేంద్రంలో మండల కన్వీనర్ నరేష్‌చారి ఆధ్వర్యంలో నాయకులు ఘనంగా జరుపుకున్నారు. చౌరస్తా వద్ద నాయకుల చిత్రపటాలు ఏర్పాటు చేసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నరేష్‌చారి మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో ఏబీవీపీ ముందుండి పోరాడిందని గుర్తు చేశారు. కోకన్వీనర్ శివకుమార్‌చారి, శేఖర్‌గౌడ్, హర్షయాదవ్, తేజ, కిరణ్, ప్రణయ్, నిఖిల్, సుదర్శన్, నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

కందుకూరు : విద్యార్థులకు జ్ఞానం, శీలం ఏకతను అలవరుస్తూ.. జాతీయవాదాన్ని ప్రేరేపించడానికి ఏబీవీపీ నిరంతరం కృషి చేస్తుందని ఆ సంఘం స్టూడెంట్ ఫర్‌సేవ జిల్లా కన్వీనర్ అనేగౌని సాయికిరణ్ అన్నారు. మండల కేంద్రంలో నాయకులతో కలిసి హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారిపై వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. నగర కార్యదర్శి డిల్లీ భానుప్రసాద్, మణికుమార్, అనిల్‌కుమార్, రాహుల్, రాజేష్, విష్ణు, అఖిల్, మరియు వివిధ కళాశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం : కార్యక్రమంలో నాయకులు

శంషాబాద్ : శంషాబాద్ మున్సిపల్ కేంద్రంలో ఏబీవీపీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో జాతీయ విద్యార్థి దినోత్సవం ఘనంగా నిర్వహించారు. శంషాబాద్ ఆర్టీసీ బస్టాండ్, అంబేడ్కర్ చౌరస్తా మీదుగా వైఎస్ఆర్ గార్డెన్స్ వరకు విద్యార్థులతో కలిసి నాయకులు భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రాంగణంలో ఏబీవీపీ జెండాను ఆవిష్కరించారు. ఆ తరువాత సెమినార్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు రావుల కృష్ణ మాట్లాడారు. ఏబీవీపీ 1949 జూలై 9న ఏర్పడిందన్నారు. విద్యార్థులకు జాతీయ భావాలు నేర్పుతూ.. జాతి పునర్‌నిర్మాణం కోసం పరితపిస్తే ఏకైక సంఘం ఏబీవీపీ అని, నేషన్ ఫస్ట్ సెల్ఫ్ నెక్స్ట్ అనే స్లోగన్‌తో ముందుకు వెళ్తుందని, విద్యార్థుల సమస్యలపై ఎన్నో పోరాటాలు చేసిందన్నారు. విద్యార్థి సంఘం చేస్తున్న పలు పోరాటాల్లో 42మంది అమరులైనారని తెలిపారు. కార్యక్రమంలో ఏబీవీపీకి చెందిన సాయిబాబు, సి.మహేష్, మణికంఠ, ప్రదీప్, అఖిల్, శివ, చరణ్, తిరుపతి, దినేష్, విజయ్, చందు, పవన్, చరణ్, హరి, అనూష తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల/షాబాద్ : విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం ఏబీవీపీ నిరంతరం పోరాడుతుందని ఆ సంఘం నగర కార్యదర్శి షైపాల్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బర్ల శ్రీకాంత్ అన్నారు. చేవెళ్ల, షాబాద్ మండల కేంద్రాల్లో ఏబీవీపీ నాయకుల ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. 76 సంవత్సరాలుగా ఏబీవీపీ విద్యార్థుల సమస్యలపై నిర్విరామంగా పోరాటం చేస్తుందన్నారు. దేశంలో విద్యార్థుల సమస్యలే కాకుండా విపత్తులకు సంబంధించిన వాటితో పాటు దేశ నిర్మాణంలో భాగస్వాములు అవుతున్న ఏకైక విద్యార్థి సంఘం ఏబీవీపీ అని చెప్పారు. నాయకులు రాఘవేందర్, ప్రదీప్, ప్రేమ్, కిషోర్, శివ, హరికృష్ణ, అనిల్, విష్ణు, కార్యకర్తలు, విద్యార్థులు తదితరులున్నారు.



కందుకూరు : వేడుకల్లో పాల్గొన్న నాయకులు

ఆమనగల్లు : విద్యారంగ సమస్యలపై ఏబీవీపీ రాజీలేని పోరాటాలు చేస్తోందని నాయకుడు భరత్ అన్నారు. పట్టణంలో భరతమాత, అంబేడ్కర్ చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. నాయకులు బండ మల్లేష్, వి.శ్రీను, సాయి, శివ, శివాచారి, శ్రీశైలం, సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల : విద్యార్థుల సమస్యలపై ఏబీవీపీ నిరంతరం పోరాడుతోందని ఆ సంఘం మండల కన్వీనర్ దండు కార్తీక్‌గౌడ్ అన్నారు. జాతీయ విద్యార్థి దినోత్సవం సందర్భంగా మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో జెండాను ఆవిష్కరించారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు.

ఇబ్రహీంపట్నం : విద్యారంగ సమస్యలపై పోరు చేయడమేగాక జాతీయ సమైక్యతకోసం ఏబీవీపీ నిరంతరం పాటుపడుతుందని ఏబీవీపీ విభాగ్ కన్వీనర్ కళ్లెం సూర్యప్రకాశ్ అన్నారు. ఏబీవీపీ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మంగళవారం ఇబ్రహీంపట్నంలోని అంబేడ్కర్ చౌరస్తాలో ఏబీవీపీ జెండాను ఎగరవేశారు. సామాజిక సమరతకోసం ఏబీవీపీ తన వంతుగా కృషి చేస్తుందన్నారు. ఏబీవీపీ గ్రేటర్ హైదరాబాద్ జాయింట్ సెక్రటరీ వంగ సంజీవరెడ్డి, నాయకులు జగదీష్ మహేందర్, జస్వంత్, అజయ్, ఆదిత్య, శవిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆమనగల్లు : భరతమాత, అంబేడ్కర్ చిత్రపటాల వద్ద నివాళులర్పిస్తున్న ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు

సమస్యల పరిష్కారానికి కృషి

కడ్తాల్, జూలై 9: ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ గ్రామాల్లో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ జడ్పీటీసీ, జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ నాయక్ అన్నారు. ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు ట్రస్ట్ ద్వారా చేయూతనందించి ఆదుకుంటామని తెలిపారు. కడ్తాల మండలం చరికొండ, గొర్లకుతండా, గడ్డమీదితండా, ఎలుగు రాళ్ల తండాలలో మంగళవారం దశరథ్ నాయక్ పర్యటించారు. ఆయా చోట్ల ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇటీవల మృతిచెందిన చరికొండ గ్రామానికి చెందిన జంగమ్మ, గుండాలు, గొర్లకుతండాకు రాజు నాయక్, ఎలుగు రాళ్ల తండాకు దర్జి, పెద్ద వేములోని బావితండాకు చెందిన మంగ్య కుటుంబాలను పరామర్శించారు. బాధిత కుటుంబాలకు జర్పుల రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఒక్కొక్కరికి రూ.5వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ నర్సింహగౌడ్, శ్వేతాభూనాథ్, నాయకులు జంగయ్య, రమేశ్, దర్గయ్య, కృష్ణయ్య, భూపాల్, చెన్నయ్య, బిచ్యనాయక్, మధు, బీమ్లా, రవి, అంజయ్య, ముత్యాలు, శ్రీను, రవి, మోహన్, మునేశ్, బాబులాల్, గోపాల్, స్థానిక నాయకులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి, జూలై 9:మండల పరిధిలోని చౌదర్‌పల్లికి చెందిన మల్లేశ్ గౌడ్ కొన్ని నెలల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. దాంతో పిల్లల చదువులకు ఇబ్బందిగా ఉందని మల్లేశ్ గౌడ్ భార్య మంజుల స్థానిక బీఆర్ఎస్ నాయకులు మాడుగుల రామస్వామి, కల్వకుర్తి తాలుకా గౌడం సంఘం కన్వీనర్ ముకురాల అశోక్‌గౌడ్‌ల ద్వారా ఉప్పల ట్రస్ట్ చైర్మన్, మాజీ జడ్పీటీసీ వెంకటేశ్‌కు విన్నవించింది. స్పందించిన వెంకటేశ్ ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ ద్వారా పిల్లలకు చదువు చెప్పించడానికి ముందుకు వచ్చారు. మంగళవారం ఉప్పల ట్రస్ట్ ద్వారా సమకూర్చిన చెక్కును మంజులకు అందజేశారు. నాయకులు కటికల శేఖర్ యాదవ్, రాస్వామి, మల్లేశ్ తదితరులు ఉన్నారు.

విరివిగా మొక్కలు నాటాలి



శంషాబాద్ రూరల్ : మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్

శంషాబాద్ రూరల్, జూలై 9 : ప్రతీఒక్కరు విరివిగా మొక్కలు నాటాలని ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ కోరారు. మంగళవారం మున్సిపల్ పరిధిలోని తొండుపల్లి 11వ వార్డులో కౌన్సిలర్ పారేపల్లి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వన మహోత్సవంలో భాగంగా ఎమ్మెల్యే మొక్కలు నాటారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. స్వచ్ఛమైన గాలి లభించలంటే విరివిగా మొక్కలు నాటాలని, పచ్చని చెట్లు ప్రగతికి మెట్లు అన్న చందంగా భవిష్యత్ తరాలకు మంచిగాలి అందించాలన్నారు. ప్రతి ఇంటి ముందు ఒక మొక్కను నాటాలని పిలుపునిచ్చారు. అంతకు ముందు ఎమ్మెల్యేకు కౌన్సిలర్ లావణ్య శ్రీనివాస్ గౌడ్ ఘనంగా స్వాగతం పలికారు. శాలువా కప్పి సత్కరించారు. మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మారెడ్డి, వైస్ చైర్మన్ బండి గోపాల్‌యాదవ్, వెంకటేష్‌గౌడ్, కౌన్సిలర్లు మేకల వెంకటేష్, రాణి, నాయకులు బుచ్చిరెడ్డి, మల్లారెడ్డి, పెంటయ్య, దర్శన్‌గౌడ్, అశోక్, మహేష్, విశ్వనాథం, నాగరాజ్, నిరంజన్, శ్రీనివాస్, లక్ష్మయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

యాచారం : పుష్కలంగా వర్షాలు కురవాలంటే అటవీ సంపదను పెంచడంపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇబ్రహీంపట్నం డివిజన్ అటవీ రేంజర్ విష్ణువర్ధన్‌రావు సూచించారు. గున్‌గల్ నర్సరీలో యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం ఎంపీడీవో, ఏపీవోలు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్, ఫీల్డ్ అసిస్టెంట్‌లకు మొక్కలు నాటడం, సంరక్షణపై అవగాహన కల్పించారు. విష్ణువర్ధన్‌రావు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యం నివారించాలంటే యుద్ధప్రాతిపదికన మొక్కలు పెంచాలన్నారు. అటవీసంపద పెరిగితే వన్యప్రాణులకు రక్షణ ఉంటుందన్నారు. విద్యుత్ స్తంభాల కింద ఎట్టిపరిస్థితుల్లో మొక్కలు నాటరాదని సూచించారు. ప్రతీ గ్రామంలో విధిగా కనీసం 20 వేల మొక్కలు పెంచడంపై ఏపీవోలు చొరవ తీసుకోవాలని యాచారం ఎంపీడీవో నరేందర్‌రెడ్డి చెప్పారు. హరితహారం కార్యక్రమం కింద నాటిన మొక్కల సంరక్షణ బాధ్యతను ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు తీసుకోవాలన్నారు. ఎట్టి పరిస్థితుల్లో నాటిన మొక్కలు ఎండిపోకుండా చూడాలన్నారు. ప్రతి పాఠశాలలో పండ్ల మొక్కలు పెంచాలన్నారు. వెంకటమ్మ, యాచారం, మంచాల, ఇబ్రహీంపట్నం మండలాల ఏపీవోలు లింగయ్య, వీరాంజనేయులు. చారి, ఇంజనీరింగ్ కన్సల్టెంట్‌లు శివశంకర్‌రెడ్డి, విమల, అటవీ శాఖ అధికారులు భాస్కర్, నర్సింహులు, లక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

ఆమనగల్లు : ప్రతీఒక్కరు ఉద్యమ స్ఫూర్తితో మొక్కలు నాటి సంరక్షించాలని మున్సిపల్ చైర్మన్ రాంపాల్‌నాయక్, వైస్ చైర్మన్ దుర్గయ్య, కమిషనర్ వసంతలు కోరారు. మాడ్గుల రోడ్డులో స్థానికులతో కలిసి సుమారు మూడు కిలోమీటర్ల మేర వివిధ రకాల మొక్కలు నాటారు. కౌన్సిలర్లు చెన్నకేశవులు. లక్ష్మణ్, దడ్డు కృష్ణ, రామునాయక్‌లు పాల్గొన్నారు.



యాచారం : మొక్కలు పెంపకంపై అవగాహన కల్పిస్తున్న విష్ణువర్ధన్‌రావు



ఆమనగల్లు : మొక్కలు నాటుతున్న చైర్మన్ రాంపాల్‌నాయక్, కమిషనర్ వసంత

సంక్షిప్తంగా..

శంషాబాద్ రూరల్ : ఆరు గ్యారెంటీలు అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై బీజేపీ ఆధ్వర్యంలో ఇందిరాపార్క్ వద్ద ఒక రోజు మహా ధర్నా నిర్వహించారు. మహిళా మోర్చా జిల్లా కార్యదర్శి కుమారి ఆధ్వర్యంలో మంగళవారం బీజేపీ మహిళ నాయకురాల్లు భారీగా తరలివెళ్లారు. దాదాపు 30 కార్లతో ర్యాలీగా తొండుపల్లి నుంచి బయలుదేరి నగరంలోని ఇందిరా పార్క్ వద్ద జరిగే ధర్నాకు వెళ్లారు.

ఆమనగల్లు : మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కాంగ్రెస్ ముఖ్య నాయకులు, కార్యకర్తల సమావేశానికి ఆమనగల్లు, కడ్తాల, తలకొండపల్లి, మాడ్గుల మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో తరలివెళ్లారు. పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, మాజీ జడ్పీటీసీ శ్రీపాతి శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రత్యేక వాహనాలలో సమావేశానికి తరలివెళ్లారు. నియోజకవర్గ నేతలతో సీఎం రేవంత్ సమావేశం అయ్యారు. ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ బలోపేతం, వచ్చే స్థానిక సంస్థల గూర్చి చర్చించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. జిల్లా, మండల నాయకులు బీక్యానాయక్, చేగూరి వెంకటేశ్, బీచ్యానాయక్, తదితరులు ఉన్నారు.

మాజీ సర్పంచ్ ఉదారత..
సొంత డబ్బుతో లింక్‌రోడ్డుకు మరమ్మతులు

- హర్షం వ్యక్తం చేసిన గ్రామస్తులు



రోడ్డుకు మరమ్మతులు చేస్తున్న గ్రామస్తులు, రాంచంద్రయ్య

చేవెళ్ల, జూలై 9 : సొంత డబ్బుతో మాజీ సర్పంచ్ రెండు గ్రామాల లింకు రోడ్డును బాగు చేయించారు. మండల పరిధిలోని రావులపల్లి నుంచి మొయినాబాద్ మండల పరిధిలోని ఎలుకగూడ గ్రామానికి వెళ్లే లింకు రోడ్డు రాకపోకలకు ఇబ్బందిగా మారింది. గ్రామస్తుల కోరిక మేరకు రావులపల్లి మాజీ సర్పంచ్ గోటూరి రాంచంద్రయ్యగౌడ్ సొంత డబ్బుతో రావులపల్లి గ్రామం నుంచి ఎలుకగూడ గ్రామం వరకు రోడ్డుకిరువైపులా ఉన్న చెట్లను తొలగించి, మధ్యలో ఉన్న వాగుపై సిమెంట్ పైపులు వేయించి రోడ్డును బాగు చేయించారు. అలాగే రావులపల్లి నుంచి ముడిమ్యాల్ గ్రామం వరకు మెయిన్ రోడ్డు సైతం బాగు చేయించడంతో ఆర్టీసీ బస్సు ప్రస్తుతం గ్రామానికి రాకపోకలు సాగిస్తోంది. ఈ మేరకు ఆయన మంగళవారం మరమ్మతులు చేయించారు. విద్యార్థులు, రైతులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రావులపల్లి పీఏసీఎస్ డైరెక్టర్ కేసారం నరేందర్, మాజీ ఉప సర్పంచ్ నాగిరెడ్డి, మాజీ వార్డు సభ్యులు కావాలి సత్యనారాయణ, కుమార్, హన్మంత్‌రెడ్డి, జైపాల్‌రెడ్డి, గ్రామస్తులు ఉన్నారు.

నేడు రైతులతో ఎమ్మెల్యే ముఖాముఖి

యాచారం, జూలై 9 : మండలంలోని మేడిపల్లి, నానక్‌నగర్, తాటిపర్తి, కుర్మిద్ద గ్రామాల రైతులతో నేడు(బుధవారం) మధ్యాహ్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, ఆర్డీవోలతో ప్రత్యేకంగా సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు ఫార్మాసిటీ వ్యతిరేక పోరాట కమిటీ నాయకులు డి.రమేష్ తెలిపారు. కోర్టు వివాదంలో ఉన్న భూముల రైతులు సమావేశంలో పాల్గొనాలని కోరారు. రైతుల సమస్యలు తెలుసుకుంటారని ఆయన తెలిపారు. రైతులు సకాలంలో హాజరుకావాలని ఈ సందర్భంగా ఆయన కోరారు.